సాక్షి
జనగామ

శుక్రవారం | 14 | ఏప్రిల్ | 2023



మార్కెట్లో రైతుల గోస

ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు వాటిని అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

- 8లో▸



నిరుద్యోగ మార్చ్ హాస్యాస్పదం

అభివృద్ధి పట్టని బీజేపీ నాయకులు నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి అన్నారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

40°/26°

వాతావరణం

ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఎండ తీవ్రత అధికమై వడగాలులు వీస్తాయి. రాత్రి పూట ఉక్కపోత ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:37	శని 4:36

న్యూస్‌రీల్

మరో పోరాటానికి సిద్ధం కావాలి



జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, రైతాంగ విధానాలకు వ్యతిరేకంగా మరో రైతాంగ పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య చందు అన్నారు. ఏఐకేఎస్ ఆవిర్భావం సందర్భంగా గురువారం జిల్లా కార్యాలయంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రం లిఖిత పూర్వకంగా ఇచ్చిన కనీస మద్దతు ధరల చట్టం, రుణ మాఫీపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం చేయకపోవడం దారుణమని, తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జోగు ప్రకాష్, రాములు, సాయి ప్రకాష్, అంజయ్య, కృష్ణ, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం పెట్టాలి



చిల్పూరు: సమస్యలు, రావాల్సిన నిధులు, హక్కులను ఎంపీపీ బొమ్మిశెట్టి సరిత, వైస్ ఎంపీపీ భూక్య సరిత పట్టించుకోవడంలేదు.. వారిపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఎంపీటీసీలు కోరారు. ఈ మేరకు ఎనిమిది మంది ఎంపీటీసీలు కలిసి గురువారం కలెక్టరేట్ ఏఓ మన్సూర్, అలాగే స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ కృష్ణవేణికి వినతి పత్రాలు అందజేశారు. మొత్తం 12 మంది ఎంపీటీసీలుండగా.. తాళ్లపల్లి ఉమ, మారేపల్లి లలితదేవి, సాదం నరసింహులు, మారబోయిన అయిలమ్మ, భూక్య యాదగిరి, కంకటి రవీందర్, జీడి ఝాన్సి, ఎన్నకూస కుమార్ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

జఫర్‌గఢ్: మండల పరిధి షాపల్లి గ్రామంలో శుక్రవారం నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కుంట రమేష్, గుగ్గిళ్ల రాజు, మాచర్ల రమేష్, బక్క నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో రెడ్ స్టార్ అసోసియేషన్ గోపాలపురం, షాపల్లి ఆధ్వర్యాన నిర్వహించే ఈ పోటీలు మూడు రోజుల పాటు జరుగుతాయన్నారు. విజేత జట్లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, పారితోషికం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

వాటర్ ఫౌంటెయిన్ ట్రయల్ రన్



జనగామ: పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెయిన్ ట్రయల్ రన్‌ను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ సుందరీకరణలో ఫౌంటెయిన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, కమిషనర్ రజిత, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయ ఇన్‌చార్జ్ డాక్టర్ సుల్తాన్ రాజా, దేవునూరి సతీష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య పీజీ ఫైనలియర్ పరీక్షల్లో 10మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో దూరవిద్య పీజీ ఫైనలియర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. వివిధ పరీక్ష కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 10మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

'బైరిసన్స్'.. ముంచెేన్

పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాల్సిన అధికారుల తీరుతో పలువురు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ముక్కూ ముఖం తెలియని సంస్థతో స్టోర్లు ఏర్పాటు చేయించి.. డిపాజిట్ డబ్బులు పూర్తిగా ఇవ్వకుండానే ఆ సంస్థ ఉడాయించిన తర్వాత తమకు సంబంధం లేదంటూ చేతులెత్తేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.



కొడవటూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బైరిసన్స్ ఎస్‌హెచ్‌జీ స్టోర్(ఫైల్)

- జిల్లాలో 60 ఎస్‌హెచ్‌జీ స్టోర్ల ఏర్పాటు
- అధిక ధరలు, నాసిరకం వస్తువులు
- కొనేవారు లేక తీవ్రంగా నష్టపోయిన మహిళలు
- ఇప్పటికే పలు దుకాణాల మూసివేత
- చేతులెత్తేసిన డీఆర్‌డీఏ అధికారులు

లింగాలఘణపురం: జిల్లాలో రెండేళ్ల క్రితం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బైరిసన్స్ అనే సంస్థతో కలిసి పొదుపు సంఘాల సభ్యులతో గ్రామాల్లో మహిళా దుకాణాల(స్టోర్స్) ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. స్టోర్ల ఏర్పాటు, శిక్షణ, అమ్మకాలకు సంబంధించి ఆ సంస్థ సహకారం అందిస్తుందని చెప్పడంతో 204 మంది ముందుకు వచ్చారు. అందులో 60 మంది మహిళలు రూ.లక్ష చొప్పున ముందుగానే ఆ సంస్థ బాధ్యులకు డిపాజిట్ చేయగా.. ఒక్కొక్క దుకాణానికి మూడు ర్యాక్‌లు, ఒక కౌంటర్, మరో బిల్లింగ్ మిషన్‌తో పాటు కొన్ని సరుకులు అందజేశారు.

ఆర్భాటంగా ప్రారంభం..

అప్పటి కలెక్టర్ నిఖిల, డీఆర్‌డీఏ అధికారులు ఆర్భాటంగా జిల్లాలో బైరిసన్స్ ఎస్‌హెచ్‌జీ స్టోర్లు ప్రారంభించారు. ప్రజలకు అవసరమయ్యే పప్పులు, ఉప్పు, బియ్యం, చక్కెర తదితర 140 రకాల నిత్యావసర సరుకులు అందజేస్తామని చెప్పారు. అలాగే ఆయా గ్రామాల్లో మహిళా సంఘాల సభ్యులతో సబ్బులు, షాంపులు, ఇతర క్లీనింగ్ రసాయనాలు తయారు చేయించి నేరుగా స్టోర్లకు తక్కువ ధరకు సరఫరా చేస్తామన్నారు. ఇందుకు అవసరమైన శిక్షణ, పంపిణీ, రవాణా తదితర ఏర్పాట్లన్నీ బైరిసన్స్ సంస్థ చూస్తుందని పేర్కొన్నారు.

పత్తాలేని బైరిసన్స్..

స్టోర్లను తెరిపించిన బైరిసన్స్ సంస్థ మూడు నాలుగు నెలలకే అడ్రస్ లేకుండా పోయింది. ఒక్కరికి కూడా ఏ ఉత్పత్తులపైనా శిక్షణ ఇవ్వలేదు. దుకాణదారులకు అందించిన సరుకులు సైతం నాణ్యతగా లేకపోవడం, బహిరంగ మార్కెట్ కంటె ఎక్కువ ధర ఉండడంతో ఎవరూ కొనుగోలు చేయడంలేదు. గతంలో మామూలుగా నడిచే దుకాణాలు బైరిసన్స్ వస్తువులతో గిరాకీ తగ్గిపోవడంతో చాలా మంది స్టోర్లు మూసివేశారు. దీంతో బ్యాంక్‌లు, స్త్రీనిధి, సెర్ప్‌ల నుంచి తీసుకున్న రుణాలు చెల్లించడానికి పడరాని పాట్లు పడుతున్నారు.

ముందు చూపు ఏదీ..?

మహిళల ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పాటు అందించే డీఆర్‌డీఏ అధికారులు ముందు చూపులేకుండా వ్యవహరించారు. బైరిసన్స్ సంస్థ ఎక్కడి నుంచి వచ్చింది.. అనుభవం ఏమిటనే విషయాలు పూర్తిగా తెలుసుకోకుండా అనుమతిచ్చారు. అంతే కాకుండా మహిళా సంఘాల సభ్యులకు ఏ ఉత్పత్తులపైనా శిక్షణ ఇవ్వలేదు. స్టోర్స్ ఏర్పాటు చేసుకున్న మహిళలకు నష్టం జరిగిన తర్వాత ఆ సంస్థతో తమకు సంబంధంలేదని డీఆర్‌డీఏ అధికారులు చెబుతుండడంతో బాధితులు మండిపడుతున్నారు.

నష్టాలతో దుకాణం మూసివేశాం



గతంలో కిరాణం షాపు నిర్వహించేది. బైరిసన్స్ సంస్థ పేరుతో ర్యాక్‌లు, కౌంటర్, బిల్లింగ్ మిషన్ ఇచ్చి రూ.లక్ష తీసుకున్నారు. వారిచ్చిన సరుకులు నాణ్యతగా లేకపోవడంతో ఎవరూ కొనుగోలు చేయలేదు. ర్యాక్‌లు, కౌంటర్, మిషన్ అన్నింటికీ రూ.50వేలు కూడా కాలేదు. మిగిలిన డబ్బులు ఇవ్వకుండానే పోయారు. అనేకసార్లు అధికారులను అడిగినా ఫలితం లేదు.

- చౌదబోయిన అనిత, లింగాలఘణపురం

రూ.30వేల డిపాజిట్ వాళ్లవద్దే ఉంది



బైరిసన్స్ సంస్థకు రూ.లక్ష చెల్లిస్తే ర్యాక్‌లు, కౌంటర్, బిల్లింగ్ మిషన్‌తో పాటు కొన్ని సరుకులు ఇచ్చారు. వాటికి రూ.70వేలు అని చెప్పారు. ఇంకా రూ.30వేల డిపాజిట్ వారి వద్దే ఉంది. ఇప్పుడు ఆ సంస్థ అడ్రస్ లేకుండా పోయింది. ప్రస్తుతం సొంతంగా కిరాణం షాపు నడుపుకుంటున్నాం. నష్టపోయిన తమకు న్యాయం చేయాలి.

- మల్లం శ్రీలత, కొడవటూరు

రుణాలు చెల్లించాల్సి వస్తుందని..



బైరిసన్స్ సంస్థ పనితీరు బాగోలేదని తెలియగానే కలెక్టర్ రద్దు చేశారు. సంస్థకు సంబంధించిన వారు ఉన్నప్పుడు దుకాణాదారులు తమకు జరిగిన నష్టం గురించి చెప్పలేదు. తీసుకున్న రుణాలు చెల్లించాల్సి వస్తుందని ఆ సంస్థ వెళ్లిపోయాక చెబుతున్నారు. 60 దుకాణాల్లో ప్రస్తుతం 55 సొంతంగా నడుపుకుంటున్నారు.

- నూరొద్దీన్, ఏపీడీ, డీఆర్‌డీఏ

'అయ్యన్నార్' విగ్రహం దొరికింది

- డిస్కవర్ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి వెల్లడి



ముళ్ల పొదల్లో లభించిన విగ్రహం వద్ద రత్నాకర్‌రెడ్డి

జనగామ: అయ్యప్ప పూర్వ రూపంగా భావించే అయ్యన్నార్ (అయ్యి) విగ్రహం ఆచూకీ లభించింది. ఈ మేరకు డిస్కవర్ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి గురువారం వెల్లడించారు. జనగామ మండలం ఎల్లంల గుట్టపై ఆలయంలో అతిపురాతనమైన అయ్యన్నార్ విగ్రహం కొన్నేళ్లుగా కనిపించడం లేదని డిస్కవర్ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి పోలీసు శాఖతో పాటు గ్రీవెన్స్‌లో ఆరు నెలల్లో రెండుసార్లు ఫిర్యాదు చేశాడు. అలాగే పురావస్తు శాఖకు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఆ విగ్రహం ఎల్లంల సమీపంలోని ముళ్ల పొదల్లో గుర్తించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమిళనాడు, కేరళలో కనిపించే అయ్యన్నార్ (అయ్యప్ప రూపం) ఆరాధన తెలంగాణలోనూ జరిగినట్లు తెలిపే తొలి చారిత్రక ఆధారాలు జిల్లాలోని జనగామ మండలం ఎల్లంల, లింగాలఘణపురం మండలం నేలపోగుల గ్రామాల్లో వెలుగు చూసినట్లు చెప్పారు. ఎల్లంల గుట్ట శివారులో కొలువు దీరిన అయ్యన్నార్ విగ్రహం గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు ఆలయాన్ని కూల్చి వేయడంతో కాల గర్భంలో కలిసిపోయిందని.. తన పరిశోధనలో గుర్తించిన ఆ విగ్రహం కొంత కాలం తర్వాత కనిపించకుండా పోవడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. చారిత్రకంగా ఎంతో ప్రాధాన్యత కలిగిన అయ్యన్నార్ విగ్రహం తిరిగి లభించిందని, దీనిని గుట్టపై తిరిగి ప్రతిష్ఠించి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

- జీసీడీఓ గౌసియాబేగం



విద్యార్థినులకు హెల్త్ కిట్లు అందజేస్తున్న జీసీడీఓ

స్టేషన్‌ఘన్‌పూర్: నాణ్యమైన విద్య అందిస్తూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలని జీసీడీఓ(గర్ల్స్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) ఎండీ.గౌసియాబేగం అన్నారు. గురువారం నమిలిగొండ శివారులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన ఆమె పాఠశాల పరిసరాలు, రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు హెల్త్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ రేణుక తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ 'డబుల్' ఇళ్లు

- నిబంధనలను ధిక్కరిస్తే చర్యలు తప్పవు
- తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్



బాధితులతో మాట్లాడుతున్న తహసీల్దార్

స్టేషన్‌ఘన్‌పూర్: అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తాం.. ప్రభుత్వ నిబంధనల్ని ధిక్కరిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఘన్‌పూర్ తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్ అన్నారు. కొత్తపల్లిలో రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిర్మించిన 30 డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు పంపిణీ చేయకపోవడంతో ఈనెల 6న గ్రామానికి చెందిన కొందరుపేదలు తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి వెళ్లి ఉంటున్నారు. ప్రజాప్రతినిధులు, ఆర్‌ఐ రవీందర్ నచ్చచెప్పినా ఖాళీ చేయకపోవడంతో తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్, సీఐ రాఘవేందర్ గురువారం అక్కడికి చేరుకుని అనుమతి లేకుండా డబుల్ బెడ్రూంలలో ఉంటున్న వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. రెండు, మూడు రోజుల్లో మరోసారి సర్వే నిర్వహించి గ్రామసభ ద్వారా అర్హులను గుర్తించి ఇళ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఉన్నవాటిలో ఇళ్లు రాని వారికి రూ.3లక్షల ప్రభుత్వ స్కీంలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పడంతో సమ్మతించి వెళ్లిపోవడంతో రెవెన్యూ అధికారులు ఇళ్లకు తాళాలు వేసి ఇళ్లను స్వాధీనం చేసుకున్నారు. హౌసింగ్ ఈఈ దామోదర్‌రావు, సీఐ రాఘవేందర్, ఆర్‌ఐ రవీందర్, ఎంపీటీసీ బెల్లపు వెంకటస్వామి, వార్డు సభ్యుడు జోగు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్ అకౌంట్లపై ఆందోళన వద్దు



రికార్డులను పరిశీలిస్తున్న డీవీఏహెచ్‌ఓ

లింగాలఘణపురం: గొర్రెల పథకానికి సంబంధించి కలెక్టర్ లాగిన్.. అలాగే వర్చువల్ అకౌంట్లపై లబ్ధిదారులు ఆందోళన చెందవద్దని డీవీఏహెచ్‌ఓ మనోహర్ అన్నారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో పథకం లబ్ధిదారుల వాటా చెల్లింపుల అంశాన్ని పరిశీలించారు. మండలంలో 355 మంది లబ్ధిదారులు ఉండగా.. 55 మందికి కలెక్టర్ లాగిన్‌లో వర్చువల్ అకౌంట్లు లేవని, వాటిని ఎలా చేయాలనే దానిపై టెక్నికల్ సిబ్బందితో మాట్లాడారు.

అంబేడ్కర్ 'జయంతి'కి ముస్తాబు





విద్యుత్ వెలుగుల్లో అంబేడ్కర్ విగ్రహం, పట్టణంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న సంఘాల నాయకులు

- నేడు జిల్లా కేంద్రంలో వేడుకలు
- హాజరుకానున్న మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

జనగామ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలకు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా ముస్తాబైంది. శుక్రవారం ఈ ఉత్సవాలకు కలెక్టర్ శివలింగయ్య పర్యవేక్షణలో నిర్వహణ కమిటీ ఆధ్వర్యాన యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, ఎంపీలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు. ఉత్సవాల నేపథ్యంలో గురువారం పట్టణంలోని ఆర్టీసీ చౌరస్తా నుంచి నెహ్రూ పార్కు మీదుగా రైల్వేస్టేషన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

12 బస్సులు.. 600 మంది..

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరించే కార్యక్రమానికి జిల్లా నుంచి 600 మంది ప్రతినిధులు వెళ్లనున్నట్లు కలెక్టర్ సీహెచ్. శివలింగయ్య తెలిపారు. ఇందుకోసం 12 బస్సులు సమకూర్చి.. ఒక్కో బస్సుకు నలుగురు అధికారుల చొప్పున పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. హైదరాబాద్‌కు వెళ్లే ప్రతినిధుల కోసం టిఫిన్, భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించామని తెలిపారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్



మాట్లాడుతున్న ఎడవెల్లి కృష్ణారెడ్డి

జనగామ రూరల్: నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడు అంబేడ్కర్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి అన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గురువారం గురువారం గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ అధ్యక్షతన కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. కార్యక్రమంలో కవులు బాలయ్య, జగదీశ్వరి, భాస్కర్, యాదగిరి, భుజేందర్, సోమ నర్సింహాచారి, జి.కృష్ణ, ప్రభాకర్, మహేందర్, రమేష్, అంజయ్య, సోమయ్య, సుదర్శన్, రామ్మూర్తి, మనోజ్, ఎల్లయ్య, ప్రసాద్, సాయికిరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్లలో సకల సౌకర్యాలు

- జిల్లా విద్యాధికారి రాము



వార్షిక పరీక్షల తీరును పరిశీలిస్తున్న డీఈఓ

పాలకుర్తి టౌన్: 'మనఊరు–మనబడి' కార్యక్రమంలో భాగంగా సర్కారు స్కూళ్లలో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ అభివృద్ధి చేస్తున్నామని డీఈఓ రాము అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను సందర్శించిన ఆయన.. భవిత కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ క్యాంపును పరిశీలించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి నారబోయిన యాకయ్య, డీసీఈబీ సహాయ కార్యదర్శి రామరాజు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అంజనేయులు, ఎంఆర్‌సీ సిబ్బంది రమేష్, కిషన్, విజయేందర్, ఇందిర, మల్లేష్ పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



జనగామ రూరల్: జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

జనగామ రూరల్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ సీనియర్ నాయకుడు చల్లా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా శ్రీనివాస్‌రెడ్డి జెండాను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యా విధానంలో మార్పుల కోసం అనేక ప్రతిపాదనలు చేసినప్పటికీ ప్రభుత్వం సరైన రీతిలో స్పందించ లేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, కార్యదర్శి ఎం.వెంకటేష్, నాగరాజు, శ్రీనివాస్, కనకయ్య, కృష్ణ, మహేష్, యాదగిరి పాల్గొన్నారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి: మండల కేంద్రంలో టీఎస్‌యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వీరమల్ల బాబయ్య అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షురాలు టి.హేమలత జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్ డీఏలు వెంటనే విడుదల చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్, నర్సయ్య, రమేష్ గంధ, సిరి ప్రసాద్, వై.విజయసారథి, తోట వెంకట్, రాంప్రసాద్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఆహార ఉత్పత్తుల్లో అగ్రభాగాన తెలంగాణ

- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి



ప్రార్థన చేస్తున్న మంత్రి, కలెక్టర్ తదితరులు

దేవరుప్పుల: రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగంగా సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంతో.. ఆహార ఉత్పత్తుల్లో తెలంగాణ అగ్రభాగాన నిలుస్తున్నదని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం మండల పరిధి ధారావత్‌తండా, సింగరాజుపల్లిలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ శివలింగయ్యతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణం, చెరువులు, దేవాదుల కాల్వల పునరుద్ధరణతో సాగునీరు పుష్కలంగా లభించి పంటలు సమృద్ధిగా పండుతున్నాయని, ఈ క్రమంలో భూముల ధరలు పెరిగి అన్నదాతల ఆత్మగౌరవం రెట్టింపైందని చెప్పారు. వ్యవసాయానికి ఉచిత కరెంటు, పెట్టుబడి సాయానికి రైతుబంధు, బీమా పథకం, పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర కల్పించడంతో రైతు కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నాయన్నారు. అనంతరం వరి మద్దతు ధర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు.

అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నాం..

పల్లెప్రగతి పనులతో సర్పంచ్‌లకు.. నూతన ఒరవడి సంస్కరణలతో ఎంపీటీసీలకు తగిన నిధులు, హోదా కరువైనది వాస్తవమే.. సీఎం కేసీఆర్ చొరవతో జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలకు గౌరవ వేతనం పదిరెట్లు పెంచి పలు పద్దుల కింద నిధులు ఇచ్చి అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం దేవరుప్పుల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బస్వ సావిత్రి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఆయా శాఖల పనితీరు సమీక్షించగా.. పల్లెప్రగతి, ఉపాధి హామీ తదితర పద్దుల కింద అభివృద్ధి పనులు చేపడితే సకాలంలో బిల్లులు రావడంలేదని, పనులు ఎలా చేపట్టాలని పలు గ్రామాల సర్పంచ్‌లు అసహనం వ్యక్తం చేశారు. ప్రాధాన్యతా క్రమంలో బిల్లులు వచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సభకు హాజరైన మంత్రి మాట్లాడుతూ కేంద్రం తగు నిధులివ్వకున్నా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం సహకారంతో పల్లెల అభివృద్ధి పరుగుపెడుతోందని చెప్పారు. మండల్ వ్యవస్థ గురించి మాట్లాడుతూ.. వాస్తవానికి ఎన్టీఆర్ హయాంలోనే జిల్లా, మండల పరిషత్‌లకు సముచిత గౌరవహోదా కల్పించారని, తిరిగి అదే కాంగ్రెస్, బీజేపీ హయాంలో నిర్వీర్యం అయ్యే క్రమంలో తాను ఎంపీగా పార్లమెంటులో లేవనెత్తినా పెడచెవిన పెట్టారన్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు మంజూరు పత్రాలను ప్రజాప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌డీఓ రామిరెడ్డి, డీఎస్‌ఓ రోజారాణి, డీఏఓ వినోద్, డీపీఓ రంగాచారి, జెడ్పీ సీఈఓ వసంత, జెడ్పీటీసీ సభ్యురాలు భార్గవి సుందర్‌రామిరెడ్డి, ఎంపీపీ బస్వసావిత్రిమల్లేషం, వైస్‌ఎంపీపీ విజయ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మతాలకతీతంగా రాష్ట్రాభివృద్ధి

పాలకుర్తి టౌన్: సీఎం కేసీఆర్ మతాలకు అతీతంగా పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని మంత్రి దయాకర్‌రావు అన్నారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందు, రంజాన్ తోఫాల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో లబ్ధిపొందడానికే బీజేపీ హింసను ప్రోత్సహిస్తోందన్నారు. కలెక్టర్ శివలింగయ్య, డీసీపీ సీతారాం, అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, డీఆర్‌డీఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్ రావును కలిసి వస్తున్న నాయకులు

హన్మకొండ: విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అసోషియేషన్ డిస్కం కార్యదర్శి బక్క దానయ్య కోరారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ అతిథి గృహంలో గురువారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోషియేషన్ డిస్కం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం జాప్యం చేస్తుందన్నారు. సొంత ఉద్యోగుల సమస్యలు పెండింగ్‌లో పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎన్పీడీసీఎల్ యాజమాన్యం విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రపంచంలోనే అతిపెద్దదైన 125 అడుగుల భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, నూతన సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్పీడీసీఎల్ సీఎండీ ఎ.గోపాల్ రావును కలిసి సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో అసోషియేషన్ డిస్కం ఉపాధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్, నాయకులు స్వదేశ్ కుమార్, లక్ష్మీనారాయణ, కృష్ణ, రవి, చలపతి, విజయ్ రాజ్, రాజు, శ్యామ్ కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

మార్కెట్‌లో రైతుల గోస

అన్నదాతలకు లాట్ ఐడీలు ఇవ్వని సిబ్బంది
- జీరో దందా కోసమేనని ఆరోపణలు
- అడ్తిదారుల కనుసన్నల్లోనే మిర్చి అమ్మకాలు
- ప్రేక్షక పాత్రలో మార్కెట్ పాలకవర్గం

సాక్షి పరిశీలన



వరంగల్ మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు.



లాట్ ఐడీ(నమూనా)

వరంగల్: ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తున్న రైతులు పంట ఉత్పత్తులను అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. రైతులకు పంటను అమ్ముకోవడంలో అండగా ఉండేందుకు మార్కెట్ కమిటీలు, రైతు సమన్వయ సమితిలు ఏర్పాటు చేసి కన్వీనర్లను నియమిస్తున్నా.. వారు పెద్ద పెద్ద వాహనాల్లో అధికారదర్పం ఒలగబోటడమే కాని ఏనాడు మార్కెట్‌లో రైతుల కష్టాలను పట్టించుకున్న దాఖలాలు లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరంగల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం 'సాక్షి' పరిశీలించి లాట్ ఐడీలపై రైతులను ప్రశ్నించగా మెజార్టీ రైతుల నుంచి ఇవ్వలేదన్న సమాధానం వచ్చింది.

ప్రతిరోజూ 35నుంచి 50వేల బస్తాల మిర్చి

సీజన్‌లో మిర్చి బస్తాలను గ్రామాల నుంచి రైతులు ఉదయాన్నే మార్కెట్‌కు తీసుకురావడంతో అలసిపోతున్నారు. అడ్తిదారుని గుమస్తాలు రాగానే తమ బస్తాలను ఆయనకు అప్పగించి కాలకృత్యాలు తీర్చుకోవడం, టీ, టిఫిన్ చేయడానికి వెళ్లిన సమయంలో అక్కడ జరిగే తంతును పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. ప్రతిరోజూ ఉదయం 7.30గంటలకు మిర్చి ధరను నిర్ణయించేందుకు జెండా పాట పాడి గరిష్ట ధరకు ఒక లాట్ ఖరీదుదారుడు కొనుగోలు చేస్తారు. అనంతరం మార్కెట్‌లోని సేట్లు ఇంటికి, మార్కెట్ సిబ్బంది యార్డుల్లోకి, అధికారులు ఆఫీసుల్లోకి వెళ్లిపోవడం ఆనవాయితీగా మారింది. ప్రస్తుతం మిర్చి దాదాపు ప్రతిరోజూ 35 నుంచి 50వేల బస్తాలు వస్తున్నాయి. యార్డుల్లోకి వచ్చిన మిర్చి బస్తాలు అప్పుడప్పుడు మాయం అవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నా.. సీసీ కెమెరాల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేదని తెలుస్తోంది. కొన్నిచోట్ల కెమెరాలు పనిచేస్తున్నందున కొన్ని బస్తాలు మాయమైన సందర్భంలో ఇరువర్గాలను సమన్వయం చేసి మార్కెట్ అధికారులు సమస్యను పరిష్కరిస్తున్న పరిస్థితి ఉంది.

జీరో దందాకు రాచమార్గం

రైతులకు లాట్ ఐడీలు జారీ చేస్తే తప్పనిసరిగా తూకం వేసి పీవోఎస్ మిషన్లలో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అందువల్ల జీరో దందాకు అవకాశం లేకుండా పోతుంది. దీంతో కొంత మంది ట్రేడర్స్, వారి గుమస్తాలు, మార్కెట్‌లోని కొంత మందితో లోపాయికారి ఒప్పందం చేసుకుని ఐడీల జారీలో అలసత్వం చేస్తున్నట్లుగా తెలుస్తోంది. కింది స్థాయి సిబ్బంది లాట్ ఐడీలు ఇచ్చారా.. లేదా అన్న విషయాలను యార్డుల్లో అధికారులు తిరిగితే తెలుస్తుంది. అధికారులు మాత్రం యార్డు ఆఫీసులకే పరిమితం కావడంతో మొత్తం దడవాయిలు, హమాలీలు, గుమస్తాల కనుసన్నల్లోనే గుట్టుగా ఈ వ్యవహారం సాగుతున్నట్లుగా తెలిసింది.

లాట్ ఐడీల్లో అన్ని వివరాలు

రైతులు మార్కెట్‌కు మిర్చి బస్తాలు తెచ్చి యార్డుల వద్ద పెట్టగానే మార్కెట్ సిబ్బంది లాట్ ఐడీలు తప్పకుండా జారీ చేయాల్సి ఉంటుంది. లాట్ ఐడీ ఇస్తే అందులో రైతు పేరు, అడ్తిదారుని పేరు, తెచ్చిన మిర్చి రకం, ఎంత సరకు తెచ్చారనే వివరాలు ఉంటాయి. కాంటాలు పెట్టే సమయంలో లాట్ ఐడీలో పేర్కొన్న బస్తాలు ఉన్నాయా..రకం ..ఇతరత్రా విషయాలను రైతులు గమనించే అవకాశం ఉంటుంది. మార్కెట్ ఉన్నతాధికారులు లాట్ ఐడీలు పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కింది స్థాయి అధికారులు, సిబ్బందితో లక్ష్యం నెరవేరడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న పాలకవర్గం ప్రేక్షకపాత్ర పోషించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లాట్ ఐడీలు ఇవ్వలేదు..



15 బస్తాల మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చాను. నాకు లాట్ ఐడీ ఇవ్వలేదు. ధరలు అయ్యాయి. ఇంకా కాంటాలు కాలేదు. గత ఏడాదిలో ఒక సారి లాట్ ఐడీ ఇచ్చారు. ఈ సీజన్‌లో రెండు సార్లు మార్కెట్‌కు మిర్చి అమ్మేందుకు వచ్చినా ఐడీలు ఇవ్వలేదు.

– యాకయ్య, లడాయిగడ్డ, కొత్తగూడ

అంతా సేటుకే ఎరుక..



46 బస్తాల సన్న మిర్చి మార్కెట్‌కు తీసుకొచ్చాను. ధర క్వింటాకు రూ.20,300లు అన్నారు. ఇంకా కాంటాలు కాలేదు. లాట్ ఐడీ ఇవ్వలేదు. మిర్చి బస్తాలు తెచ్చి సేటుకు అప్పగించడం వరకే తెలుసు. ఇవన్నీ ఏమి తెలియదు.

– వీరన్న నాయక్, గోప్యాతండా, కేసముద్రం

ధర అడ్తిదారులకే తెలుసు..



మార్కెట్‌కు 8 బస్తాల మిర్చి తీసుకొచ్చాను. లాట్ ఐడీ ఇవ్వలేదు. అసలు ఎప్పుడూ కూడా లాట్ ఐడీలు ఇవ్వలేదు. మిర్చి బస్తాలు కాంటాలు కాలేదు. ధర కూడా అడ్తిదారులకే తెలుసు.

– రాజఅయిలు, గొల్లపల్లి, గణపురం

బీజేపీ నిరుద్యోగ మార్చ్ హాస్యాస్పదం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

న్యూశాయంపేట: తెలంగాణ అభివృద్ధి పట్టని బీజేపీ నాయకులు రేపు హనుమకొండలో నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ కార్యదర్శులు, ముఖ్యనాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విభజన హామీలు నెరవేర్చని కేంద్రాన్ని నిరుద్యోగులు నిలదీయాలని పిలుపునిచ్చారు. ఇటీవల చేపట్టిన ప్రజాపోరు యాత్ర వల్లే కేంద్రంలో, రాష్ట్రంలో విభజన హామీలపై చర్చ మొదలైందన్నారు. రానున్న రోజుల్లో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని కూడా చేపట్టి విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా 12రోజుల పాటు విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ చేపట్టిన ప్రజాపోరు యాత్రలో పాల్గొన్న 200 మంది నాయకులు కార్యకర్తలకు ప్రశంసా పత్రాలు, మెమోంటోలను వెంకట్‌రెడ్డి అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు విజయసారధి, నేదునూరి జ్యోతి, మేకల రవి, కర్రె భిక్షపతి, రాజారెడ్డి, రాజ్‌కుమార్, మల్లికార్జున్‌రావు, రమేష్, తోట భిక్షపతి, ఎల్లేష్, ఆదరి శ్రీనివాస్, సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'యువిక-2023'కి నిఖిల్ ఎంపిక

- అభినందించిన డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్



కాళోజీ సెంటర్: బాల్యదశలోనే సైన్స్, అంతరిక్ష పరిశోధన రంగాలపై ఆసక్తి పెంచి విద్యార్థులను ఈ రంగాల వైపు మళ్లించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈ వేసవి సెలవుల్లో చేపడుతున్న యువిక-2023 కార్యక్రమానికి వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బట్టు నిఖిల్ ఎంపికయ్యాడు. దేశ వ్యాప్తంగా కేవలం 9వ తరగతి విద్యార్థుల కోసమే ఏర్పాటు చేసిన ఈ యువిక (యువ విజ్ఞాన కార్యక్రమం)లో రెండు వారాల పాటు వచ్చే మే నెలలో దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నాలుగు వివిధ కేంద్రాల్లో మొత్తం 350 మంది విద్యార్థులకు స్పేస్ సైన్స్, స్పేస్ టెక్నాలజీలలో శిక్షణ ఇస్తారు. దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో 350మంది విద్యార్థుల్లో 22వ ర్యాంకు సాధించి నిఖిల్ ఎంపిక కావడం పట్ల డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనివాస్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేసి నిఖిల్‌ను అభినందించారు. ఈ శిక్షణలో నిఖిల్‌కు అయ్యే పూర్తి ఖర్చులు ఇస్రో భరించనుంది.

ఎద్దు పొడిచి బీటెక్ విద్యార్థి మృతి

- మేతకు ఎడ్లను తీసుకెళ్లగా ఘటన



భానుప్రకాశ్(ఫైల్)



భానుప్రకాశ్ మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కేసముద్రం: మేత మేపేందుకు తీసుకెళ్లిన ఎద్దు పొడవడంతో ఓ బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. ఈ విషాదకరమైన ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పనికరి పద్మ, కొమురమల్లు దంపతులకు కుమారుడు భానుప్రకాశ్(19), కూతురు అలేఖ్య ఉన్నారు. భానుప్రకాశ్ హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల కాలేజీ నుంచి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు పని నిమిత్తం ఇంటివద్ద ఉండగా, తమకున్న రెండు ఎడ్లను మేపేందుకు భానుప్రకాశ్ పంటచేను వద్దకు తీసుకెళ్లాడు. ఎద్దు మూతికి కట్టిన బుట్టి విప్పే క్రమంలో ఆ ఎద్దు చాతిభాగంలో పొడవడంతో అతను కింద పడిపోయి, గట్టిగా కేకలు వేశాడు. కొంత దూరంలో ఉన్న అతడి పెదనాన్న యాకమల్లు పరుగెత్తుకుంటూ అక్కడికి వచ్చి భానుప్రకాశ్‌ను బైక్‌పై కేసముద్రంస్టేషన్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడినుంచి మహబూబాబాద్‌లోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

కాలేజీకి వెళ్లినా బతికేటోడు..

బీటెక్ ఫస్టియర్ చదువుతున్న భానుప్రకాశ్ గురువారం ఉదయం కాలేజీకి వెళ్లాలనుకున్నాడు. కొత్త డ్రెస్ కొనుక్కొని శుక్రవారం వెళ్లొచ్చని ఇంట్లో చెప్పడంతో ఇంటి వద్ద ఉండిపోయాడు. అతను ఒకవైపు చదువుకోవడంతోపాటు, తన వంతుగా వ్యవసాయ పనులను చేస్తూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేవాడు. ఈ మేరకు ఎడ్లను మేపేందుకు వెళ్లిన అతన్ని ఎద్దుపొడవడంతో మృతిచెందాడు. కాలేజీకి వెళ్లినా బతికేటోడివంటూ కుమారుడి మృతదేహంపై పడి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించిన తీరు అక్కడున్న వారందరిని కంటతడిపెట్టించింది. భానుప్రకాశ్ కుటుంబాన్ని గురువారం రాత్రి ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పరామర్శించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వరికోత మిషన్ నడపడానికి వెళ్లి..



ఆంజనేయులు(ఫైల్)

బచ్చన్నపేట: మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వరికోత మిషన్ నడపడానికి వెళ్లి ప్రమాదవశాత్తు సాగర్ కాల్వలో పడి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుక్కసావు ఆంజనేయులు(40) డ్రైవింగ్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారం రోజుల క్రితం ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం గొల్లపూడికి చెందిన ఏజెంటు చల్ల కృష్ణ ఇంటికి వరికోత మిషన్ నడపడానికి వెళ్లాడు. పనిలో భాగంగా గురువారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం వద్ద వరికోతలు కోస్తున్నాడు. విరామ సమయంలో సాగర్ కాల్వపై స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారీ అందులో పడ్డాడు. నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో అండర్ టెన్నల్‌లో చిక్కుకుని శ్వాస ఆడక మృతి చెందాడు. ఈ సమాచారం మేరకు అక్కడకు వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం చేసిన అనంతరం స్వగ్రామానికి తీసుకొచ్చారు. మృతునికి భార్య మమత, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్..



హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ (ఫైల్)

దామెర: చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ మృతిచెందాడు. ఈ ఘటన దామెర మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ హంటర్ రోడ్డుకు చెందిన గుగ్గిళ్ల ప్రసాద్ (53) ములుగు జిల్లా కేంద్రంలో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 10న రాత్రి విధులు ముగించుకొని హనుమకొండకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో ఊరుగొండ సమీపంలో జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న బ్రిడ్జి వద్ద గుంతలో ద్విచక్ర వాహనంతో సహా పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలు కాగా వెంటనే స్థానికుల సాయంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు. అక్కడినుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు దామెర పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రసాద్ అవయవాలు జీవన్‌దాన్ ట్రస్ట్‌కు దానం చేశారు.

వడదెబ్బతో ఒకరు..



భిక్షపతి (ఫైల్)

నెక్కొండ: వడదెబ్బతో ఒకరు మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నెక్కొండకు చెందిన దేవులపల్లి భిక్షపతి (43) వడదెబ్బకు గురై వాంతులు, విరేచనాలు కావడంతో బుధవారం రాత్రి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన చికిత్స అందించాలని వైద్యులు సూచించడంతో నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి భిక్షపతి మృతి చెందాడు. పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు భిక్షపతి మృతదేహాన్ని సందర్శించారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్ట్

- రూ.10 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సీతారాం

జనగామ రూరల్: మద్యానికి, చెడు వ్యసనాలకు బానిసై సులభంగా డబ్బు సంపాధించాలని స్నేహితుడి ఇంట్లో ఓ వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఆ నిందితుడిని గురువారం పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీపీ సీతారాం వివరాలు వెల్లడించారు. బచ్చన్నపేట గ్రామానికి చెందిన సందెల రాజేష్(అలియాస్ రాజు) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. వచ్చే ఆదాయం సరిపోవక పోవడంతో చెడు వ్యసనాలకు అలవాటుపడ్డాడు. భవాని నగర్‌లో నివాసం ఉంటున్న రాజేష్ ఈ నెల 9వ తేదిన తన స్నేహితుడు వంశీ ఇంటి తాళం పగులగొట్టి రూ.10లక్షలు ఎత్తుకెళ్లాడు. ఈ విషయంపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా డీసీపీ సూచన మేరకు ఏసీపీ దేవేందర్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐ శ్రీనివాస్, ఎస్సై రఘుపతి, సృజన్ సిబ్బందితో జనగామ బస్టాండ్ వద్ద నిందితుడిని పట్టుకొని దొంగిలించిన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ చూపించిన ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, నర్మెట సీఐ నాగబాబు, ఎస్సై రఘుపతి, సృజన్, సల్మాన్ పాషా, శ్రీనివాస రాజు, కానిస్టేబుళ్లు మహేష్, రామన్న, కర్ణాకర్, అనిల్‌కుమార్, కిరణ్‌కుమార్‌లను వారు అభినందించారు.

బట్టల దుకాణంలో షార్ట్ సర్క్యూట్

- సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ చౌరస్తాలోని ఎంపి గుప్తా రెడీమేడ్ బట్టల దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో స్వల్పంగా దగ్ధమైంది. దుకాణ యజమాని సోదరుడు అభిషేక్ అగర్వాల్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగా గురువారం ఉదయం 10 గంటలకు దుకాణం తెరిచి మెయిన్ ఆన్ చేశారు. కొద్ది సేపటికే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో జనరేటర్ ఆన్ చేశారు. తిరిగి విద్యుత్ రావడంతో దుకాణంలోని మూడో అంతస్తులోని గోడౌన్‌లో మంటలు రావడాన్ని సిబ్బంది గమనించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు నేతృత్వంలో సుమారు రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పి వేశారు. ఈ నెలలో రంజాన్ పండుగ ఉండడంతో కొత్త స్టాక్ తెప్పించామని వివరించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 8 లక్షల ఆస్తినష్టం జరిగిందని అభిషేక్ అగర్వాల్ తెలిపారు.

పట్టుదలతో చదివితేనే బంగారు భవిష్యత్



మంత్రిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఘనంగా సీజేఐటీ సిల్వర్ జూబ్లీ వేడుకలు

జనగామ: విద్యార్థులు పట్టుదలతో చదువుకుని బంగారు భవిష్యత్ పొందాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ మండలం యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రాత్రి బిషప్ ఉడుముల బాల అధ్యక్షతన జరిగిన సిల్వర్ జూబ్లీ వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువును ఆషామాషీగా తీసుకుంటే, ఆగమైపోతారన్నారు. కళాశాలకు తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని, బీటీ రోడ్డు సైతం మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదువుకునే విద్యార్థులు సమాజానికి ఆదర్శవంతులన్నారు. బిషప్ ఉడుముల బాల మాట్లాడుతూ సీజేఐటీలో 25 ఏళ్ల కాలంలో చదువుకున్న వేలాది మంది విద్యార్థులు ప్రపంచంలోనే అనేక దేశాల్లో స్థిరపడ్డారన్నారు. కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సీజేఐటీ ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తుందన్నారు. వరంగల్ నిట్ డైరెక్టర్ ఎన్వీ రమణారావు, జేఎన్‌టీయూహెచ్ రిజిస్ట్రార్ మంజూరు హుస్సేన్, సీజేఐటీ డైరెక్టర్ అగస్టీన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 25 వసంతాలు పూర్తి చేసుకున్న ఇంజనీరింగ్ కళాశాల్లో సీజేఐటీ ఒక్కటిగా నిలిచి పోతుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే, విద్యా వేత్తలను కాలేజీ నిర్వాహకులు శాలువా, మెమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉత్సవాల కన్వీనర్లు బి.స్వప్న, కరుణాకర్, ఏఎస్ రావు, ప్రణయ్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

నర్సంపేట రూరల్ : ఉరివేసుకొని ఒకరు మృతి చెందారు. ఈ సంఘటన నర్సంపేట పట్టణంలో గురువారం జరిగింది. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. నర్సంపేట పట్టణం వరంగల్ రోడ్డులోని ఆర్టీసీ కండక్టర్ రేసు శ్రీనివాస్ (51) నర్సంపేట డిపోలో విధులు నిర్వహించి కొన్ని సంవత్సరాల క్రితం తొర్రూర్ డిపోకు ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లారు. అయితే శ్రీనివాస్‌కు ఆరోగ్య స్థితి బాగలేక పోవడంతో విధులకు వెళ్లలేకపోతున్నాడు. ఈ క్రమంలో గత నెల 13న విధుల నుంచి తొలగించారు. దీంతో అనారోగ్య, విధుల నుంచి తొలగించడంతో మనోవేదనకు గురై శ్రీనివాస్ ఇంట్లో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.